ఓసీ-3 సందర్శించిన

సింగరేణి జీఎం



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తు జీఎం రాజేశ్వర్‌రెడ్డి

గణపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన సింగరేణి ఏరియా భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి ఓసీ-3 ప్రాజెక్ట్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ స్థితి గతులను, బొగ్గు ఉత్పత్తి, రవాణ, భూసేకరణ సంబంధిత అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రషర్ సైట్‌ను సందర్శించి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, భానుప్రసాద్, శ్రీనివాస్, అరుణ్‌ప్రసాద్, దయాకర్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్ తనిఖీ

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం- 1994 ప్రకారం ములుగు పట్టణంలోని సరళ స్కానింగ్ సెంటర్‌ను వైద్యఆరోగ్యశాఖ ఉప అధికారి డాక్టర్ విపిన్ కుమార్, మాతా, శిశు సంరక్షణ, పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు సెంటర్‌లోని పలు రికార్డులను పరిశీలించడంతోపాటు బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్, ధరల పట్టిక, డాక్టర్ల వివరాలు అడిగి తెలుసుకుని నిర్వాహకులకు నోటీసు జారీ చేశారు. డెమో సంపత్, ఏఎంవో దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.



సామాజిక సర్వేకు సర్వం సిద్ధం..

- నేటి నుంచి రెండు రోజుల పాటు స్టిక్కరింగ్
- ఇప్పటికే సిబ్బందికి శిక్షణ
- 15 రోజుల్లో పూర్తికానున్న కులాల వారీ సర్వే
- 8వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి వివరాల సేకరణ

(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి) : రాష్ట్ర ప్రభుత్వం కులాల వారిగా జనాభా గణనకు ఏర్పాట్లు పూర్తి చేసింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను ఈ సామాజిక సర్వేలో వెల్లడయ్యే వివరాల ఆధారంగానే నిర్వహించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు కులాల వారి గణనను జరిపించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈనెల 8వ తేదీ నుంచి 15 రోజులపాటు జిల్లాలోని 12 మండలాలతో పాటు భూపాలపల్లి మున్సిపాలిటీల్లో 56 అంశాలతో కూడిన సర్వేను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం ఎన్యుమరేటర్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేసింది. సామాజిక సర్వేలో భాగంగా రేటర్లు ఈనెల 6,7 తేదీల్లో మొట్టమొదటగా తమకు కేటాయించిన ప్రాంతంలో ఇళ్లను లెక్కించనున్నారు. ఆ తర్వాత ఎనిమిదో తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి 56 అంశాలతో రూపొందించిన ఫార్మాట్ ప్రకారం సామాజిక సర్వేలో వివరాలను సేకరించనున్నారు. ఈ సామాజిక సర్వే ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నప్పటికీ 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినా అవసరాన్ని బట్టి మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ సర్వేకు సంబంధించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ పలు దఫాలుగా జిల్లా అధికార యంత్రాంగంతో విస్తృతంగా సమీక్ష సమావేశాలను నిర్వహించి అవగాహన కల్పించారు. అటు అధికార పార్టీ కూడా ఈ సామాజిక సర్వేను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఏ ఒక్క ఇల్లు తప్పిపోకుండా అన్ని ప్రాంతాల్లో సమగ్రంగా సర్వే నిర్వహించేలా ఆ పార్టీ కార్యకర్తలను కూడా మొహరిస్తున్నారు. వచ్చే స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు ఈ గణాంకాల ఆధారంగానే జరిగే అవకాశం ఉందనే అంచనాలు వెలబడుతున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. గత దశాబ్ద కాలంగా సామాజిక సర్వే జరగకపోవడంతో ప్రస్తుతం జరుగుతున్న సామాజిక సర్వేలో ఎలాంటి ఫలితాలు వెలుగులోకి రాబోతున్నాయన్న దానిపై సర్వత్రా ఆసక్తికరమైన చర్చ మొదలైంది.

1.31 లక్షల ఇండ్లు 1164 మంది సిబ్బంది

ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సామాజిక సర్వే కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 1,31,036 ఇండ్లలో సర్వే నిర్వహించడం కోసం మొత్తం 1164 మంది సిబ్బందిని మోహరించనున్నారు. ఇందులో 1043 మంది ఎన్యూమరేటర్లు కాగా, 121మంది సూపర్వైజర్లు సర్వేను పర్యవేక్షించనున్నారు. మొత్తం జిల్లాలోని ఇండ్లను 991 బ్లాకులుగా గుర్తించి ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 899 బ్లాకులు, పట్టణ ప్రాంతాలను 92 బ్లాకులుగా విభజించారు. మొత్తం 1043 మంది ఎన్యుమరేటర్లు సర్వే జరపనుండగా, ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 842మంది, పట్టణ ప్రాంతాల్లో 92మంది సర్వే నిర్వహిస్తారు మరో 109 మందిని రిజర్వుడ్‌గా సిద్ధం చేశారు.

సామాజిక సర్వేకు ఇళ్ల జాబితాను తయారు చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు6,7 తేదీల్లో ఇండ్ల జాబితాను తయారు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి తహసిల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు,ఎంపీఓలు, సూపర్‌వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన కలెక్టర్ బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇళ్ల జాబితాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6,7 తేదీల్లో జిల్లాలోని అన్ని గ్రామాల్లో, మునిసిపాలిటీ పరిధిలో ఇంటింటి జాబితాను ప్రారంభించాలన్నారు. ఇంటింటి జాబితా గణనలో భాగంగా ప్రతి ఇంటింటికి స్టిక్కర్ అంటించాలన్నారు. సర్వే పూర్తైన తదుపరి మార్కర్ పెన్‌తో తేది రాయా లన్నారు. 8 నుంచి జిల్లాలో సర్వే ప్రారంభం కానుందని 15 రోజుల్లో సర్వే పూర్తి చేయిటకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జిల్లాలోని 1,31,030 ఇండ్ల సర్వే నిర్వహణకు 933 మంది ఎన్యూమరేషన్ బ్లాకులుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 842 మంది పట్టణ ప్రాంతాల్లో 92 మంది సర్వే చేయనున్న ట్లు పేర్కొన్నారు. 109 మంది ఎన్యూమరేటర్లు రిజర్వ్‌గా ఉండనున్నట్లు తెలిపారు. సర్వేను పర్యవేక్షించేందుకు123 మంది సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. సర్వేకు 150 ఇండ్లను ఒక ఎన్యూమరేషన్ బ్లాక్‌గా కేటాయిం చినట్లు తెలిపారు. రోజుకు 10 ఇండ్ల చొప్పున 15 రోజుల్లో 150 ఇండ్లల్లో సర్వే పూర్తి చేయా లన్నారు. ఎన్యూమరేటర్లకు అవసరమైన స్టేషనరీతో కూడిన కిట్ అందించాలన్నారు. సర్వే నిర్వహణకు ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని ఒక పూట స్కూల్‌కు వెళ్లి మధ్యా హ్నం సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీఓ మంగిలాల్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.



వీసీలో ఫార్మట్‌ను చూపిస్తున్న కలెక్టర్

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

- అధికారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే ఆదేశాలు



బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై నుంచి వెళుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ప్రధాన రహదారిని మంగళవారం పరిశీలించారు. రోడ్డుపై నుంచి మురికినీరు వెళుతున్న దృశ్యాన్ని చూసి ఆయన చలించారు. వెంటనే మునిసిపల్, పీఆర్ అధికారులను పిలిచి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ చౌరస్తా నుంచి సుభాష్‌కాలనీ వరకు గల రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం మూలంగా రోడ్డుపై నుంచి మురికినీరు వెళుతుందని అన్నారు. కాగా వెంటనే ఈ పనులను చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, పీఆర్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీలో

పోలీస్‌శాఖ ప్రతిభ

- అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించిన డీజీపీ



డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న వెంకటేశ్వర్లు

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయడంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా జిల్లా పోలీసుశాఖ ప్రతిభ కనబరించింది. ఏప్రిల్ 2023 నుంచి అక్టోబరు 2024 వరకు జిల్లా వ్యాప్తంగా 484 ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అందించారు. దీంతో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ జితేందర్ జిల్లా పోలీసుశాఖను అభినందించారు. సీఈఐఆర్ పోర్టల్ నోడల్ ఆఫీసర్, సీసీఎస్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు.

క్వారీ పనులను అడ్డుకున్న ఫారెస్టు అధికారులు

ఏటూరునాగారం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్యాల- కొండాయి గ్రామాల మధ్యగల జంపన్నవాగులో చేపడుతున్న ఇసుక క్వారీ పనులను అటవీశాఖాధికారులు మంగళవారం అడ్డుకున్నారు. ఫారెస్టు రేంజ్ అధికారి అబ్దుల్ రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాల- కొండాయి పరిధిలో గల జంపన్నవాగు పరిధి ఎకో సెన్సిటీయా జోన్‌పరిధిలో ఉన్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేసి ఆరు లారీలను అటవీశాఖ కార్యాలయానికి తరలించడం జరిగిందన్నారు. అదేవిధంగా క్వారీ నిర్వహణ పనులు చేపడుతున్న కేవీఎం సంస్థకు పనులను నిలిపి వేయాలని, లేనిచో చర్యలకు వెనుకాడమని తెలిపినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. అదేవిధంగా కార్యాలయానికి తరలించిన లారీ యజమానులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి లారీలను విడుదల చేసినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

ప్రత్యేక అధికారికి

స్వాగతం పలికిన కలెక్టర్



ములుగులో కలెక్టర్ దివాకరతో చర్చిస్తున్న ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి మంగళవారం ములుగు జిల్లాకు రాగా కలెక్టర్ టీఎస్.దివాకర మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా వినయ్‌కృష్ణారెడ్డి కలెక్టర్, అధికారులతో సమావేశమై ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఆన్‌లోడ్, హమాలీలు, లారీల ఏర్పాటు, తదితర అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి



చల్వాయిలో అధికారులకు సూచనలు చేస్తున్న ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి

గోవిందరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని ఉమ్మడి వరంగల్ జిల్లా ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి, రీహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులు, నిర్వాహకులకు సూచించారు. ఈమేరకు ఆయన మంగళవారం మండలంలోని చల్వాయి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, డబ్బుల చెల్లింపులు, తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దొడ్డురకం, సన్నరకం ధాన్యాన్ని వేర్వేరు సంచుల్లో తూకం వేసి మిల్లులకు పంపించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎఫ్ఏక్యూ ప్రమాణాలను పాటించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లింపులు చేపట్టాలని, ఎలాంటి అవకతవకలు జరుగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, డీసీఎస్‌వో ఫైజుల్‌హుస్సేనీ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి, డీసీవో సర్ధార్‌సింగ్, తదితరులు ఉన్నారు.

లోడర్ తరలింపునకు ప్రయత్నం?

- అడ్డుకున్న సూపర్‌వైజర్లు.. గొడవకు దిగిన కాంట్రాక్ట్ సిబ్బంది

కాకతీయఖని, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి పక్కకు పెట్టిన లోడర్‌ను కొందరు వ్యక్తులు (కాంట్రాక్టర్‌కు చెందినవారు) తరలించేందుకు ప్రయత్నం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఓసీ-3లో బొగ్గును లోడ్ చేసేందుకు ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన లోడర్లకు అదనపు మీటర్లు పెట్టి ఎక్కువ రీడింగ్ రాస్తున్నారనే సమాచారం అందుకున్న విజిలెన్స్ (ఎస్‌టీ పీపీ) అధికారులు దాడులు నిర్వహించి రెండు లోడర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఒక లోడర్లను వదిలేసి మరో లోడర్‌ను మాత్రం పక్కకు పెట్టించినట్లు సమాచారం. అయితే దానిని సింగరేణి అధికారుల అండర్‌లో ఉంచి విజిలెన్స్ అధికారులు విచారణ కొన సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు సోమవారం రెండవ షిఫ్టు, రాత్రి షిఫ్టులో లోడర్‌ను తరలించేందుకు ప్రయత్నం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన సింగరేణి ఉద్యోగులతో సదరు కాంట్రాక్ట్ సిబ్బంది గొడవకు దిగినట్లు కార్మికులు చెబుతున్నారు. అయితే సింగరేణి అధికారుల అండర్‌లో ఉండాల్సిన లోడర్ తాళం చేవి కాంట్రాక్ట్ సిబ్బంది దగ్గరకు ఎలా వెళ్లిందని కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు. రెండు రోజులు లోడర్ వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించిన అధికారులు ఆ తర్వాత ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఆ లోడర్‌ను దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే భద్రంగా ఉంటుందని అంటున్నారు. ఏదేమైనా లోడర్‌ను అక్కడి నుంచి తరలించే ప్రయ త్నం ఎందుకు చేస్తున్నారో.. ఒక లోడర్‌ను వదిలి పెట్టి మరో లోడర్‌ను ఎందుకు అక్కడే ఉంచారో.. అసలు ఓసీ-3 వద్ద ఏం జరుగుతుందోనని అయోమయంలో కార్మికులు ఉన్నారు. విజిలెన్స్ అధికారులు త్వరగా విచారణ ముగించి లెక్క తేలిస్తే ఈ అయోమయానికి తెరపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జడ్పీలో ఏడుగురు అటెండర్లు?

- అవసరంలేకున్నా కార్యాలయంలో డిప్యూటేషన్లు



భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగుల (అటెండర్ల) డిప్యూటేషన్‌పై విమర్శలు వస్తున్నాయి. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సిన అటెండర్లు డిప్యూటేషన్‌పై జెడ్పీకి చేరుకున్నారు. ఈ కార్యాలయంలో అధికారికంగా ఇద్దరు అటెండర్లు ఉంటే.. అనధికారికంగా మరో ఐదుగురు పని చేస్తున్నారు. వీరంతా కార్యాలయ అవసరాల నిమిత్తమైతే పర్వాలేదు కానీ, ఈ శాఖలోని అధికారి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మహాముత్తారం నుంచి 1, మల్హర్ నుంచి 1, గొర్లవీడు 1, రేగొండ మండలం తిరుమలగిరి నుంచి 1, రేగొండ మండల కేంద్రం నుంచి 1 డిప్యూటేషన్ పై జెడ్పీ కార్యాలయానికి నియమించారు. అయితే, ఈ కార్యాలయంలో ఇద్దరు అటెండర్లు పర్మనెంట్ ఉండగా వారితో పూర్తి కార్యకలాపాలు చక్కబెట్టొచ్చు. అలాంటిది ఐదుగురు అటెండర్లను డిప్యూటేషన్ పై కార్యాలయానికి తెచ్చుకోవడం ఏమిటనే విమర్శలు వస్తున్నాయి. అయితే, వీరిలో ఇద్దరు ఇట్టి శాఖలోని ప్రధాన అధికారికి వంట చేయడానికి, మరొకరు అధికారికంగా ఇచ్చిన నివాసంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించేందుకు నియమించుకున్నట్లు బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ హోదాకు మించి ఈ కార్యాలయంలో అటెండర్లు పని చేస్తుండడంతో ఒకింత విస్మయం కలిగిస్తోంది. కాగా, ఇదే విషయమై జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జీ అదనపు కలెక్టర్ విజయలక్ష్మీని వివరణ కోరగా.. కార్యాలయంలో ఇద్దరు పర్మనెంట్ అటెండర్లు ఉన్నారన్నారు. అదనంగా ఉన్న వారిలో ఒకరు సీఈవో కార్యాలయం కార్యకలాపాలు చూస్తున్నారన్నారు. మరో ఇద్దరు అటెండర్లు జెడ్పీ చైర్మన్‌కు కేటాయించిన వారని, మళ్లీ ఎన్నికలు జరిగితే వారిద్దరు చైర్మన్‌కు వెళ్తారన్నారు. ఇంకో ఇద్దరు తాను బాధ్యతలు చేపట్టక ముందు నుంచే కార్యాలయంలో ఉంటున్నారని, ఆ విషయాన్ని పూర్తి స్థాయిలో తెలుసుకుంటానని స్పష్టం చేశారు. తాను తన సొంత పనులకు అనధికారికంగా వినియోగిస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తన వంట తానే చేసుకుంటానని ధీమాగా చెప్పారు.

సాయుధ పోరాటానికి ప్రపంచ గుర్తింపు



పాలకుర్తి సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ



పాలకుర్తిలో నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాల వేస్తున్న దయాకర్ రావు

- భూమి, భుక్తి కోసం జరిగిన పోరు అజరామరం
- నల్ల నర్సింహులు లాంటి వారు పుట్టడం ఈ గడ్డకే గర్వకారణం
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- నర్సింహులు పోరాటం గొప్పది : దయాకర్‌రావు
- పాలకుర్తిలో నల్ల నర్సింహులు విగ్రహావిష్కరణ

పాలకుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు నల్ల నర్సింహులు విగ్రహాన్ని నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4వేల మంది రైతులు, ప్రజలు అమరులయ్యారని గుర్తు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటం అజరామరం అన్నారు. నర్సింహులు లాంటి యోధుడు తెలంగాణలో జన్మించడం ఈ ప్రాంతానికే గర్వకారణన్నారు. నర్సింహులు రాసిన పుస్తకాన్ని తాను ఢిల్లీకి రైల్లో వెళ్తున్న సందర్భంలో చదివినట్లు చెప్పారు. వచ్చే రెండేళ్లలో నర్సింహులకు నూరేళ్లు నిండుతాయని, ఇక్కడి ప్రజలందరు ఆయన శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేరళ, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో భూమి కోసం భూస్వాములపై ప్రజలు తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. భారత దేశంలో 1920లో కమ్యూనిస్టు పార్టీ దున్నేవాడికే భూమి అనే నినాదం తీసుకువచ్చిందని గుర్తుచేశారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేశారని అన్నారు. మా దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వం అని కమ్యూనిస్టులు పోరాడినట్లు తెలిపారు.

జమిలి ఎన్నికలకు బీజేపీ సన్నాహం..

దేశంలో జమిలి ఎన్నికలు జరపించేలా బీజేపీ సిద్ధమవుతోందని, దానిని వ్యతిరేకించేందుకు ఇండియా కూటమితో కలిసి వామపక్ష పార్టీలు పని చేస్తాయని నారాయణ స్పష్టం చేశారు. ఈ రోజుల్లో ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి వెళ్తున్న నాయకులు సిగ్గుపడాలన్నారు. పార్టీ మారాలి అనుకునేవారు రాజీనామా చేసి వెళ్లాలని సూచించారు. దేశంలో మెజారిటీ ప్రజలు ఐక్యంగా ఉండాలని ప్రధాని పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు.

నర్సింహులు పోరాటం ఎంతో గొప్పదని : దయాకర్‌రావు

మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ నల్ల నర్సింహులు చేసిన పోరాటం ఎంతో గొప్పదన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొంరయ్య, షేక్‌బందగీ లాంటి పోరాట యోధులే కాకుండా కవులు బమ్మెర పోతన, పాల్కూరికి సోమనాథుడు, వాల్మీకి లాంటి వారు ఇక్కడి జన్మించినట్లు తెలిపారు. పాలకుర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ మంచి మిత్రుడని అన్నారు. నల్ల నర్సింహులు, కొండా లక్ష్మన్‌బాపూజీ విగ్రహాల ఏర్పాటుకు తాను సహకరించినట్లు తెలిపారు.

దేశ్‌ముఖ్‌లది నీచమైన చరిత్ర : పాశం

సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ సాయుధ పోరాట సమయంలో 150 మందిని చంపి, మహిళలను అర్ధనగ్నంగా బతకమ్మ లాడించిన నీచ చరిత్ర దేశ్‌ముఖ్‌లదన్నారు. నర్సింహులు, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డిలకు ఉరి శిక్ష వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అన్ని ప్రశ్నించారు. పోరాటం గురించి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏం తెలుసని ప్రశ్నించారు. కార్యక్రమానికి సభ అధ్యక్షుడుగా మాచెర్ల సారయ్య, నర్సింహులు కూతురు అరుణ, సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యేలు రాజారెడ్డి, వన్నాల శ్రీరాములు, వల్లకాటి రాజ్‌కుమార్, అబ్బాస్, సింగారపు రమేష్, తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మంజుల, సాంబయ్య, భార్గవ్, సుదర్శన్ కృపాకర్, చిదురాల ధనుంజయ తదితరులు ఉన్నారు.

అడవిలో దొంగలు

- వందకు పైగా టేకు చెట్ల నరికివేత
- బరిగలోనిపల్లి వద్ద ఘటన



దుండగులు నరికిన టేకు చెట్లు

ములుగు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అడవిలో దొంగలు పడ్డారు. జిల్లాకేంద్రానికి సమీపంలోనే తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. వందకుపైగా టేకు చెట్లను నరికివేసి తరలించారు. ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ ములుగు రేంజ్ ఇంచర్ల బీట్ పరిధిలోని బరిగలోనిపల్లి శివారు వరహాలగుట్ట సమీప అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు టేకు చెట్లను నరికివేశారు. అధికారుల కళ్లుగప్పి ఎవ్వరికీ అనుమానం రాకుండా వారం రోజులుగా నరివేతకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. పెట్రోల్, బ్యాటరీతో పనిచేసే రంపపు యంత్రాలను ఉపయోగించినట్లు స్పష్టమవుతోంది. దుంగలను వాహనాలలో రాత్రివేళ రహస్య ప్రాంతాలకు తరలించారు.

గతంలో జంగాలపల్లి వద్ద ఉన్న ఫారెస్టు చెక్‌పోస్టును ఎత్తివేసినప్పటికీ ఇటీవల జాతీయ రహదారిపై నిఘా పెరిగింది. పోలీసులు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల భయంతో స్మగ్లర్లు టేకు దుంగలను సమీప గ్రామాలలోనే భద్రపరిచినట్లు తెలుస్తోంది. కాగా, ఈ ఇటవీ ప్రాంతంలోనే ఏడాది క్రితం టేకు చెట్లను నరికిన ఘటన జరిగింది. అప్పట్లో విచారణ జరిపిన అధికారులు సంబంధిత పరవేక్షణ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. తాజాగా వెలుగుచూసిన ఘటనపై ఫారెస్టు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఫొటోలు, వీడియోలను తెప్పించుకున్న రేంజ్ అధికారి క్షేత్రస్థాయిలో తనిఖీకి ఆదేశించినట్లు సమాచారం. చెట్లను నరికిందెవ్వరు..? సొంత శాఖ సిబ్బంది ఎవ్వరైనా సహకరించారా..? దుంగలను ఎక్కడికి తరలించారు..? అనే పలు కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు.

టీజీవో మానుకోట జిల్లా నూతన కమిటీ ఎన్నిక



టీజీవో జిల్లా కమిటీ బాధ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని డీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం టీజీవో జిల్లా నూతనశాఖ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎం.వేలాద్రి, సహాయ ఎన్నికల అధికారిగా బోళ్ల రాజేష్‌రెడ్డి వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ రఫీ, అసోసియేట్ అధ్యక్షుడిగా వేల్పుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బానోత్ జగదీశ్వర్, వేముల సురేష్, డాక్టర్ రాజ్‌కుమార్, హరిప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, కార్యదర్శిగా కొప్పు ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా పి.సదానందం, తిరుపతి రెడ్డి, అబ్దుల్ మాలిక్, డాక్టర్ వి.నరేష్ ఎన్నికయ్యాయరు. మహిళా సహాయ కార్యదర్శిగా డాక్టర్ ప్రియదర్శిని, కోశాధికారిగా డాక్టర్ బి.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.సోమ్లానాయక్, పబ్లిసిటీ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్, ఆఫీస్ సెక్రటరీగా గణేష్, కల్చరల్ సెక్రటరీగా జి.సంజీవ, స్పోర్ట్స్‌అండ్‌గేమ్స్ సెక్రటరీగా మున్వర్‌బేగ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా బి.వీరన్న, బి.శ్రీనివాస్, అఫ్సర్‌పాషా, మహిళా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జ్యోత్స్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రెసిడెంట్ బి.శ్యామ్, కోశాధికారి ఎం. ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్, మానుకోట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు పమ్మినాగబ్రహ్మాచారి, కృష్ణార్జునరావు, ఎల్లయ్య, రవీంద్రరావు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన టీజీవో బాధ్యులు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు.



కాలసర్ప నివారణ దోష పూజలు చేస్తున్న భక్తులు

కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు

మహదేవపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీకమాసం కావడంతో భక్తులు కాల సర్ప దోష నివారణ పూజలతో పాటు నవగ్రహ పూజలు, అభిషేకాలు, పలు ప్రత్యేక పూజలు చేశారు.

గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి గోదావరి మాతకు పలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉద యం నుంచే పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కార్తీకమాసం కావడంతో పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. దీనికి ఇతర ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఐదుగురు పేకాటరాయళ్ల అరెస్ట్

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు జవహర్‌నగర్‌కాలనీలోని మాలోతు రవి అనే వ్యక్తి ఇంట్లో రైడ్ చేయగా ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ. 22,110 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో సమయపాలన ఏదీ ?

కాటారం డివిజన్‌లో స్థానికంగా ఉండని ఉపాధ్యాయులు

మహదేవపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్య, అభివృద్ధి దిశగా సర్కారు పాఠశాలల్లో ఇటీవల కొత్త ఉపాధ్యాయులను నియమించింది. సర్కారు బడులను బలోపేతం చేసే దిశగా పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొకటిగా తీరుస్తూ ముందడుగు వేస్తోంది. ఈ క్రమంలో మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మల్హర్, కాటారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటి ంచడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం వేళల్లో ఆలస్యంగా వస్తూ సాయంత్రం వేళల్లో తొందరగా వెళ్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయులు పనిచేసే ప్రాంతాల్లోనే సానికంగా ఉండాలని ఆదేశాలు ఉన్నా ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకపోవడంతో సమయపాలన తప్పుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు వరంగల్, హనుమకొండ, పెద్దపల్లి, మంచిర్యాల తదితర పట్టణ ప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తూ పనిచే స్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు భూపలపల్లి జిల్లా కలెక్టర్ స్థానికంగా ఉండాలని సమయ పాలన పాటించాలని పలు సందర్భాల్లో సూచించినా కొంత మంది ఉపాధ్యాయులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆయా మండాలాల్లోని ప్రభుత్వ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో బోధన కుంటుపడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమయపాలన పాటించాలని, మెరుగైన బోధన సాగేలా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

వృద్ధురాలి ఆత్మహత్య

కేసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి చైతన్యనగర్ కాలనీలో సోమవారం రాత్రి అనారోగ్య సమస్యలతో కొమ్ము ముత్తమ్మ (63) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ మంగళవారం తెలిపారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద క్రిమిసంహార మందుతాగగా ఆమెను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడా సంబురం

- ఘనంగా సైక్లింగ్ పోటీలు షురూ
- రెండు రోజులు రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు
- పాల్గొంటున్న 382 మంది క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన ఏసీపీ

లింగాలఘణపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీసులు మంగళవారం జనగామ జిల్లా లింగాలఘణపూరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలను జనగామ ఏసీపీ పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన 382 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే క్రీడాకారులు లింగాలఘణపురం చేరుకున్నారు.



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ పార్థసారథి

ముఖ్యఅతిథి ఏసీపీ మాట్లాడుతూ సైక్లింగ్ పోటీలు క్రీడాకారుల్లో మానసికోల్లాసంతో పాటుగా శారీరక ధృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు గ్రామీణప్రాంత క్రీడాకారుల్లో ఆసక్తి పెరగడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి లోనే కాకుండా జాతీయస్థాయిలో క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలను మెరుగుపరుస్తాయన్నారు. అంతర్ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు జనగామ జిల్లాలోని లింగాలఘణపురం మండలం వేదిక కావడం గర్వకారణమన్నారు. అంతర్‌జిల్లా స్థాయి పోటీలు జనగామ జిల్లా ప్రాంత యువతకు ఎంతగానో ఉపకరిస్తుందని సూచించారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, ఉమ్మడి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కృషి అభినందనీయమన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కి ఎదగాలని ఏసీపీ ఆకాంక్షించారు.

తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కాంత్‌రావు మాట్లాడుతూ సైక్లింగ్ పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో జనగామ జిల్లాలో నిర్వహించడం మొదటిసారి అన్నారు. సైక్లింగ్ పోటీల పట్ల గ్రామీణ ప్రాంత క్రీడాకారులు దృష్టిసారించి తమలో అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని సూచించారు. కార్యక్రమంలో లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్, జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐత కిషన్‌తో పాటుగా ఫిజికల్ డైరెక్టర్లు రవి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ మధుసూదనాచారిని సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్థులు

సల్లంగ చూడు పెద్దమ్మ తల్లి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

మొగుళ్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడిపంటలు, ఆయురారోగ్యాలతో సల్లంగా చూడాలని తెలంగాహన మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వేడుకున్నారు. మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు మంగళవారం ముదిరాజ్ కులస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ కులస్థులు మధుసూదనాచారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పెద్దమ్మతల్లి దేవాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, నాయకులు చదువు అన్నారెడ్డి, కొడారి రమేష్, జోరిక సదయ్య, కృష్ణారెడ్డి, ప్రభురెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు. మండలకేంద్రంలో ముది రాజ్ కులస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయం బుధవారం ప్రారంభంతోపాటు విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనుంది.

కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

ముగ్గురు సూపర్‌వైజర్లను విచారించిన అధికారులు

కాకతీయఖని, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : సింగరేణి భూపాలపల్లి ఏరియాలో విజిలెన్స్(ఎస్‌టీపీపీ) అధికారుల విచారణ కొనసాగుతోంది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్- 3లో జరిగిన పలు అవకతవకలపై వారు పూర్తి స్థాయిలో కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. మంగళవారం నలుగురు సింగరేణి సూపర్‌వైజర్లను విచారణకు పిలువగా ముగ్గురు మాత్రమే విచారణకు హాజరైనట్లు సమాచారం. కాగా వారిని రీడింగ్, ఇన్వాయిస్‌లో సంతకాలు, రికార్డుల విషయాలపై అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. లోడర్ల విషయంలో జరిగిన అవకతవకలకు సూపర్‌వైజర్లకు ఎలాంటి సంబంధంలేని సదరు సూపర్‌వైజర్లతో లెటర్ రాయించి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఎంక్వయిరీలో విజిలెన్స్ అధికారులు నమ్మలేని నిజాలు బయ టకు వస్తున్నట్లు సమాచారం. అయితే కిందిస్థాయి అధికారులను విచారించడం త్వరగా పూర్తి చేసి పై స్థాయి అధికారులను విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని కార్మికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన వాహనాల టెండర్‌లో డబ్బులు చేతులు మారినట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు సంబంధిత టెండర్ దారులను విచారించి వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

13న వాహనాలకు వేలం

నెహ్రూసెంటర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సారా, బెల్లం సరఫరా, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 13న వేలం వేయనున్నట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలతో పాటు కురవి, సీరోలు, డోర్నకల్, గార్ల, బయ్యారం పోలీస్‌స్టేషన్లలో పట్టుబడిన వాహనాలకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల వేలంలో పాల్గొనే ఔత్సాహికులు మహబూబాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం పేరిట డీడీ తీయాలని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన డీడీని కార్యాలయంలో అందించి 13న ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భారీగా అక్రమ కలప అంటూ వదంతులు

రంగంలోకి దిగి అనుమతి ఉందని తేల్చిన అటవీశాఖ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అనంతారంలో భారీగా అక్రమ కలప ఉందంటూ మంగళవారం వదంతులు రావడంతో జిల్లా స్ట్రైకింగ్ ఫోర్స్ రేంజ్ అధికారి సురేష్, మహబూబాబాద్ రేంజ్ అధికారి జోత్స్నదేవిలు సిబ్బందితో సహా అనంతారం చేరుకున్నారు. అక్కడ నిల్వ ఉంచిన టేకు కలపను పరిశీలించారు. కలప నిల్వ చేసిన యాజమానుల వద్ద ఉన్న పర్మిట్ కాగితాలను పరిశీలించారు. అనంతారంలో భారీ మొత్తంలో టేకు కలప డంపింగ్ అయినట్లు సోషల్ మీడియాలో పోస్టింగ్ వైరల్ కావడంతో మహబూబాబాద్ డీఎఫ్‌వో బత్తుల విశాల్ స్పందించారు. వెంటనే జిల్లా స్ట్రైకింగ్ ఫోర్స్ రేంజ్ అధికారి సురేష్, మహబూబాబాద్ రేంజ్ అధికారి జోత్స్నదేవి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. వెంటనే అనంతారంకు చేరుకుని రంగంలోకి దిగిన అటవీ అధికారులు పర్మిట్ కర్ర అని తేల్చిచెప్పారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

నెల్లికుదురు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గత రెండు రోజులు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అర్చరీ, కత్తి సాము క్రీడలు మంగళవారం రాత్రి ముగిసాయి. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్ 14 నుంచి 17 వరకు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అర్చరీ క్రీడలలో 48 మం ది విద్యార్థులు, కత్తిసాము క్రీడలలో 72 మంది విద్యార్థులను జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక చేశారు. అర్చరీలోజాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు గుజరాత్‌లో నిర్వహించే జాతీయ క్రీడలలో, కత్తిసాములో ఎంపికైన విద్యార్థులు జమ్ముకాశ్మీరులో నిర్వహించే క్రీడలలో పాల్గొననున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గడ్డం సత్యనారయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాందాస్, ఎస్సై రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ చెడుపల్లి ఐలయ్య, రాష్ట్ర రాష్ట్ర పరిశీలకులు రవి, హరికృష్ణ శ్రీనివాసు, పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కేసముద్రం విద్యార్థులు

కేసముద్రం : సంగారెడ్డి జిల్లాలో ఈనెల 6 నుంచి 8 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ హాకీ పోటీలకు కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం బందెల రాజు, పీడీ కొమ్ము రాజేందర్ తెలిపారు. హన్మకొండలో ఇటీవలె ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు బానోత్ విష్ణు, చరణ్, బాదావత్ సాయిమణిలు ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హెచ్ఎం, పీఈటీతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ముగ్గురి ఎంపిక



ప్రణయ్



మహ్మద్ రకీబ్



శశిధర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, మెదక్‌లలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ నాకౌట్ కం లీగ్ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి బి. అజయ్‌సారధిరెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ జట్టులో స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీల్లో మన్నెం ప్రణయ్, మహ్మద్ రకీబ్, కిన్నెర శశిధర్‌లు పాల్గొనన్నుట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి కి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. వీరి ఎంపికపట్ల కోచ్ మెతకు కుమార్, సహాయ కోచ్ తోట వినయ్‌కుమార్, సభ్యులు ఆయిలి సంతోష్ హర్షం వ్యక్తం చేశారు.

యువ

సంగీతం.. సాహిత్యం..

- సంగీత దర్శకుడిగా ట్రెండింగ్‌లో కార్తీక్
- గేయ రచయితగా దూసుకుపోతున్న పూర్ణాచారి
- పల్లె జీవనం, జానపదాలే వారికి ప్రేరణ
- వీరిద్దరిదీ ములుగు జిల్లాయే..



సినీ గేయ రచయిత పరిపూర్ణాచారి



సంగీత దర్శకుడు కార్తీక్

ములుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒకరికి సంగీతమంటే ప్రాణం.. మరొకరికి సాహిత్యమే ఊపిరి.. అందమైన పదాలను కూర్చుగా అల్లడంలో ఒకరు దిట్టయితే.. ఆపదాలకు వినసొంపైన బాణీలు సమకూర్చడంలో మరొకరు దిట్ట.. ఒకే పాఠశాలలో విద్యాభ్యాసం.. పక్కపక్క ఊళ్లు.. మధ్యతరగతి కుటుంబాలు.. కష్టజీవుల వెతలు.. రోజూ వినే జానపదాలు.. వీధినాటకాలు.. పల్లె జీవన చిత్రమే ప్రేరణగా ఆ ఇద్దరు తాము ఎంచుకున్న మార్గంలో దూసుకుపోతున్నారు. క్షణక్షణం అప్‌గ్రేడ్ అవుతున్న రంగుల ప్రపంచంలో తమ టాలెంట్‌కు పదును పెట్టుకుంటూ సుస్థిర స్థానం సంపాదించుకునేందుకు కష్టపడుతున్నారు. వారే యువ సంగీత దర్శకుడు కార్తీక్ కొడకండ్ల, సినీ గేయ రచయిత చల్లూరి పరిపూర్ణాచారి.

ములుగు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన చల్లూరి లక్ష్మి, రాజమౌళి దంపతుల కుమారుడైన పరిపూర్ణాచారి కాకతీయ విశ్వ విద్యాలయంలో బీఫార్మసీ పట్టా పొందారు. జానపద కళాకారులకు పెట్టింది పేరైన బండారుపల్లిలో పండుగలు, ఉత్సవాల సందర్భంగా స్థానిక యువకులు వీధినాటకాలు ప్రదర్శించేవారు. రామప్ప పరివాహకంలో ఏడాది పొడవునా పంటలు సాగవుతుండగా శ్రమను మర్చిపోయేందుకు కూలి తల్లుల నోట నిత్యం ఉయ్యాల పాటలు, జానపదాలు పొలిమేరలను పరవశం పజేస్తూనే ఉంటాయి. వీటి నుంచి ప్రేరణ పొందిన పరిపూర్ణాచారి ద్రౌపది వస్త్రాప హరణం, సింహబలుడు నాటకంలో పాత్రలు పోషించి పద్యాలను గొంతెత్తి పాడేవాడు. కొన్ని సినీ, జానపదాలకు పేరడీలు రాసేవారు. ఉన్నత విద్యను అభ్యసించే క్రమంలో కొన్ని స్టేజీలపై పేరడీ పాటలను పాడిన ఆయన ఆతర్వాత తన సొంత కవిత్వంపై దృష్టి సారించారు. హైదరాబాద్‌కు పయమైన ఆయన 2014లో తొలిసారి తెలుగు సినిమాకు పాట రాసే అవకాశం దక్కించుకొని వెండితెరపై తన పేరు ను చూసుకొని మురిసిపోయారు. 2016లో

పేరడీ నుంచి సింగిల్ కార్డు దాకా..

విడు దలైన ప్రేమమ్ సినిమా పాటతో అందరి మన్ననలు అందుకున్న ఆయన ఆ తర్వాత పూర్ణాచారిగా ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటివరకు 160సినిమాలకు 538 కిపైగా పాటలు రాశారు. ఇటీవల విడుదలై విమర్శ కుల చేత శభాష్ అనిపించుకున్న శివంభజే సినిమాతో పాటు మొత్తం 36సినిమాలకు సింగిల్ కార్డు గేయ రచయితగా మారారు. దాస్ కా దమ్కీ సినిమాలోని ఆల్‌మోస్ట్ పడిపోయానే పిల్లా పాటతోపాటు సవారి సినిమాలోని ఉండిపోవ నువ్విలా.. అంటూ సాగే ఇంకో పాట చారి కలం నుంచి జాలు వారినవే. తాజాగా టాలీవుడ్ ప్రతిష్ఠాత్మక మిర్చీ మూవీ, సినారే వంశీ ఫిల్మ్ అవార్డులను గెల్చుకున్న పూర్ణాచారి ప్రస్తుతం మ్యాడ్ స్క్వేర్, కోర్టు సినిమాలతోపాటు రవితేజ, బెల్లకొండ శ్రీనివాస్ లాంటి హీరోలు నటిస్తున్న పలు సినిమాలకు పాటలు రాస్తున్నారు.



పరిపూర్ణాచారిని అభినందిస్తున్న బాలకృష్ణ

కంప్యూటర్ వదిలి కీబోర్డు పట్టుకొని..

అందరు యువకుల్లాగే కొడకండ్ల కార్తీక్ ఇంజనీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరారు. తల్లి పద్మ అంగన్‌వాడీ టీచర్ కాగా, తండ్రి వెంకటాచలం ప్రైవేటు ఉద్యోగిగా పడి కష్టాన్ని చూసిన కార్తీక్ తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోంగా చేస్తూ నెలజీతంతో వారికి ఆసరగా నిలిచాడు. కానీ తాను అనుకున్నది కాలేకపోయానన్న వేదన మాత్రం ఆయనలో మిగిలేఉంది. ఈ క్రమంలో ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి ఆశయానికి అండగా నిలిచారు.. ప్రోత్సహించారు. ఫలితంగా తెలుగు సంగీతంలో తొలి బ్రీత్‌లెస్ సాంగ్‌కు అంకురం పడింది. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న కలం నుంచి జాలువారిన బంధూక్ సినిమాలోని 'పూసిన పున్నమి వెన్నెల మేన తెలంగాణ వీణ'.. పాటకు బాణీలు సమకూర్చింది మన కార్తీకే. వెంకటాపూర్(రామప్ప) మండలం కేశవాపూర్‌కు చెందిన కార్తీక్ ఎంటెక్ పూర్తిచేసి ఇన్ఫోసిస్‌లో మంచి ప్యాకేజీతో ఉద్యోగంలో చేరాడు. మ్యూజిక్‌పై మక్కువతో కొన్నేళ్లకే ఉద్యోగాన్ని వదిలిపెట్టాడు. శాస్త్రీయ సంగీతంలో మెళకువలు నేర్చుకున్నాడు. 2015లో సినీ రంగంలోకి ప్రవేశించిన ఆయన ఇప్పటివరకు 15సినిమాలకు సంగీతం అందించారు. చిత్రీకరణ జరుపుకొంటున్న డొక్కా సీతమ్మ బయోపిక్‌తో పాటు ఉద్వేగం లాంటి రాబోయే పలు సినిమాలకు బాణీలు సమకూర్చుతున్నారు.



దర్శక దిగ్గజం రాఘవేందర్‌రావుతో కార్తీక్

మెగాస్టార్ చిరంజీవి పద్మభూషణ్ అవార్డు పొందిన సందర్భంగా శిల్పకళావేదికలో 15మంది తెలుగు గాయకులతో సంగీత విభావరి నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. 2016, 2019, 2023లో ఆయన సంగీతం సమకూర్చిన బతుకమ్మ పాటలు ఇప్పటికీ యూట్యూబ్, ఇన్‌స్టాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు కూడా కార్తీక్ సంగీతం అందించారు. ఇటీవల ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రచార పాటలకు కూడా ఆయన మ్యూజిక్ ఇచ్చి చంద్రబాబు నాయుడు నుంచి ప్రశంసలు అనిపించుకున్నారు. జెట్టి సినిమాలోని దూరం కరిగినా..మౌనం కరుగునా.. పాట కార్తీక్‌కు మంచిపేరు తెచ్చింది.

వరంగల్‌కు చెందిన సినీ దర్శకుడు తరుణ్‌భాస్కర్‌తో కలిసి అనుకోకుండా.. అనే ఓషార్ట్ ఫిల్మ్‌ను కూడా తీశారు. ప్రముఖ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కేఎస్.చిత్ర, సుశీల, బాంబే జయశ్రీతోపాటు పలువురు తెలుగు వర్ధమాన గాయకులతో కలిసి పనిచేశారు.

హైదరాబాద్‌లో సొంతంగా కేకే స్టూడియోను నడుపుతున్న ఆయన 600కు పైగా పాటలకు బాణీలు అందించారు. తానా, నాటా సంస్థల ఆహ్వానం మేరకు అమెరికాకు వెళ్లి అంతర్జాతీయ వేదికలపై మెరిశారు. ఆయన సంగీతం సమకూర్చిన 'సింగారి' అనే పాటల ఆల్బమ్ ఇటలీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది.

మా పూజలందుకో నాగన్న..

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

- నాగేంద్రుడికి మహిళల నీరాజనం
- పుట్టల వద్దకు పెద్ద ఎత్తున మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



రుద్రేశ్వరుడి ఆలయంలో సీపీ దంపతులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాస వేళ మంగళవారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితిని జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు నాగేంద్రుడి పుట్టలున్న ప్రాంతాలకు బారులుతీరి పయనమయ్యారు. కార్తీక మాసంలో వచ్చే ఈ నాగుల చవితికి ప్రత్యేక విశిష్టత ఉంది. ఈ మాసంలో కన్యలు స్వామివారిని ప్రార్థించి అభిషేకించి మొక్కులు చెల్లిస్తే కల్యాణం జరుగుతుందని, సంతానం లేని వారు నాగేంద్రస్వామి ఆలయంలో చెట్టుకు ఉయ్యాల కడితే సంతానం కలిగి ఇంట్లో తొట్టె ఊగుతుందని భక్తుల విశ్వాసం. అంతేగాకుండా స్వామి వారికి క్షీరాభిషేకం చేసి గోత్రనామాలతో అర్చన చేయిస్తే సర్పదోషం తొలిగిపోతుందని నమ్ముతారు.

రుద్రేశ్వరాలయంలో..

హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నవరసాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున ఉన్న పుట్టల వద్దకు తెల్లవారుజామునుంచే మహిళలు బారులు తీరి నాగేంద్రుడికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో రుద్రేశ్వరుడిని దర్శించుకొని అక్కడ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయమే సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులు ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.

హనుమకొండలో..



రుద్రేశ్వర ఆలయంలో నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమకొండ బ్రాహ్మణవాడలోని నాగుల వీధిలో మహిళలు తరలి నాగేంద్రుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరామోజు సోమేశ్వర్‌రావు, చీకటి రాజు, చందుపట్ల ధన్‌రాజ్ తదితరులు భక్తులకు సహకరించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లోని పుట్టల వద్దకు, ఎక్సైజ్ కాలనీ లోని శ్రీవేంకటేశ్వరాలయం, రెవెన్యూ కాలనీలోని శ్రీరామాలయం, తదితర ప్రాంతాల్లోనూ ఉన్న పుట్టల వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకొని నాగేంద్రుడికి మొక్కులు చెల్లించుకున్నారు.

నగరంలో ఎక్కడ చూసినా మహిళలు కోలాహలంగా పుట్టల వద్దకు చేరుకునే విషయాలు ఆవిష్కృతమయ్యాయి. నాగేంద్రుడి పుట్టల వద్ద నున్న మట్టిని బంగారంగా కొలుస్తూ భక్తిశ్రద్ధలతో వేడు కలను నిర్వహించారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. నర్సంపేటలోని శివాలయంలో, వర్ధన్నపేటలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో, గీసుగొండ మండలంలోని ఊకల్ గ్రామంలో శ్రీబాలనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో వేడుకలు వైభవంగా జరిపించారు. వరంగల్ నగరంలోని ఉర్సు శంభునిపేట ప్రాంతంలో గల ప్రసిద్ధ నాగమయ్య దేవాలయం, ఎల్లంబజార్‌లోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, శ్రీభద్రకాళి దేవాలయం, ఓసిటీలోని ఆంజనేయస్వామి దేవాలయం, కాశిబుగ్గలోని శివాలయం, వెంకట్రామ జంక్షన్‌లోని శ్రీకనకదుర్గా దేవాలయం, బట్టల బజార్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం, రంగంపేటలోని భవాని శంకర ఆలయం, కుంటిభద్రయ్య గుడి, మల్లికార్జున స్వామి ఆలయం, జేపీఎన్‌రోడ్డు శ్రీదాసాంజనేయ స్వామి దేవాలయంలోని నాగేంద్రస్వాములకు ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలను చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో దీపాలు వెలిగించి ఆకాశ దీపాన్ని దర్శించుకొని ఉపవాస దీక్ష విరమించారు.

ఉపాయం చేశారు.. ఉపాధి పొందుతున్నారు

- ప్లాస్టిక్ మోకులతో నెలకు రూ.50 వేల సంపాదన
- తెలుగు రాష్ట్రాల్లో అబ్బయ్య 'గీత మోకుల'కు ప్రత్యేక గుర్తింపు

స్వయంకృషి



మోకుల తయారికి ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ పొట్టెలను చూపుతున్న అబ్బయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికంగా ఎన్నో మార్పులు, అవిష్కరణలు జరుగుతున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక యంత్రాలు వస్తున్నాయి. కానీ గీత కార్మికులకు అవసరమైన యంత్రాలు మాత్రం రాలేదు. వారు నేటికీ సంప్రదాయ విధానాలనే అవలంబిస్తున్నారు. ఈ క్రమంలో గీత కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్ పేరుతో కొన్ని వస్తువులను అందజేసింది. 20 ఏళ్లకంటే ముందు గీతకార్మికులు తాటిచెట్లు ఎక్కడానికి మోకులను సొంతంగా తయారు చేసుకునేవారు. తాటి మట్టకు రెండు వైపుల ఉండే గర్లు, తాటిపొట్టెలను తీసి వాటిని పురిపెట్టి బలమైన తాడును తయారు చేసుకునేవారు. అలా తయారు చేసిన మోకులు ఒకటి, రెండేళ్ల పాటు పనిచేసేవి. ఆ తర్వాత అవి దెబ్బతినేవి. కానీ అది అర్థం కాక చెట్లపైకి ఎక్కిన తరువాత మోకులు తెగి కార్మికులు కింద పడి మృత్యువాత పడేవారు. అలాగే అంగవైకల్యానికి గురి అయ్యేవారు. నాడు ఆపరిస్థితులను చూసిన జనగామ జిల్లా చిలుపూరు మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన గీత కార్మికులు పూజరి రామస్వామి, పూజరి మోగిళి, ఘన్‌పూర్‌కు చెందిన దూసరి అబ్బయ్యతో కలిసి వివిధ షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ తాళ్ల (పొట్టెలు) సేకరించారు. కొన్ని పొట్టెలను చీరి వాటిని కట్టలుగా కట్టి పురిపెడుతూ బలమైన ఎంటును రూపొందించి దాని ద్వారా మోకును తయారుచేశారు. తదనంతరం ఇద్దరు కార్మికులు మోకల తయారి నుంచి నిష్క్రమించగా నాటి నుంచి నేటి వరకు అబ్బయ్య ప్లాస్టిక్ మోకులను తాయరు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ ప్లాస్టిక్ మోకులు ఆరేళ్ల వరకు మన్నికగా ఉంటాయి. సుమారు 25ఏళ్లుగా అబ్బయ్య తన భార్య భాగ్యలక్ష్మి, కుమార్తె సుమలత, కోడలు విజయ, మనువళ్లు అరవింద్, సిద్దులతో కలిసి మోకులు తయారు చేస్తున్నారు. వయసు రీత్యా రెండేళ్లుగా గీత వృత్తిని మానుకున్న అబ్బయ్య మోకుల తయారీపైనే దృష్టి పెట్టారు.



ప్లాస్టిక్ మోకుల తయారీకి పొట్టెలను పురిపెడుతున్న అబ్బయ్య దంపతులు

పలు జిల్లాల నుంచి కొనుగోలుదారుల రాక

అబ్బయ్య తయారు చేసిన మోకులను కొనుగోలు చేయడానికి గాను రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గీత కార్మికులు వస్తుంటారు. కరీంనగర్, నల్లగొండ. జనగామ, సిద్దిపేట, అదిలాబాద్, ఖమ్మం, మెదక్, మానకొండూరు, సిరిసిల్ల, మహబూబాబాద్, హన్మకొండ, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో అబ్బయ్య మోకులంటే మంచి గుర్తింపు ఉంది. నగటున ఒక మోకును రూ.800కు విక్రయిస్తుండగా.. అన్ని ఖర్చులుపోను తమకు రూ.600వరకు లాభం ఉంటుందని, రోజుకు గిరాకీ బట్టి 4 నుంచి 5 మోకులు తయారు చేస్తామని అబ్బయ్య చెబుతున్నారు. నెలంతా కష్టపడితే తమకు రూ.50వేల వరకు ఆదాయం ఉంటోందని, ఇదే తమ కుటుంబానికి ఆదాయ వనరుగా మారిందని చెబుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి మోకులు కొనుగోలు చేయడం సంతృప్తినిస్తోందంటున్నారు.

ప్లాస్టిక్ మోకుతో ధైర్యంగా ఉంది..



పూజరి రాజ్‌మోహన్, గీత కార్మికుడు, చిన్నపెండ్యాల

ప్లాస్టిక్ మోకుతో తాటిచెట్టు ఎక్కడం ధైర్యంగా ఉంటుంది. అబ్బయ్య వద్ద మూడేళ్ల క్రితం ఒక మోకును కొనుగోలు చేశా. ఈ మోకులను పటిష్ఠంగా తయారుచేయడంలో అబ్బయ్య దిట్ట అని, నాలాంటి అనేక మంది కార్మికులకు ఉపయోగపడేలా నైపుణ్యంతో మోకులు తయారు చేస్తున్న అబ్బయ్యను ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకం అందించాలి.

నాణ్యతకు మారుపేరుగా మోకుల తయారి



పాలకుర్తి నాగరాజు, గీత కార్మికుడు, తాటికొండ

అబ్బయ్య తయారు చేస్తున్న మోకులు ఎంతో పటిష్ఠంగా, నాణ్యంగా ఉంటాయి, బరువు కూడా తక్కువ ఉండేలా మోకులను తయారు చేయడంలో అబ్బయ్యది అందెవేసిన చేయి. వివిధ ప్రాంతాల్లో యంత్రాలపై మోకులను తయారు చేస్తుంటారు. అవి అంత నాణ్యతగా ఉండవు. కానీ చేతితో చేసే అబ్బయ్య మోకులు బలంగా ఉంటాయి. అందుకే 12 ఏళ్లుగా అబ్బయ్య వద్దే మోకులు కొనుగోలు చేస్తున్నా.

సర్వే సరే.. పాఠాలు మరి!

- నెల రోజుల పాటు ప్రాథమిక విద్యకు విఘాతం
- ప్రక్రియ పూర్తయ్యే వరకు ఒంటిపూట బడులు
- ఉపాధ్యాయ వర్గాల నుంచి అభ్యంతరాలు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి కులగణన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ సర్వేతో రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో సుమారు నెల రోజుల పాటు విద్యాబోధనకు విఘాతం ఏర్ప డుతోంది. దీంతో విద్యార్థులు చదువులో వెనుకబడే ప్రమాదం కనిపిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడు వారాల పాటు కుల గణన సర్వేను నిర్వహించనుండటం, అం దుకు ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నియమించడమే ఇందుకు కారణమవుతోంది. అయితే ఉదయం మాత్రమే పాఠశాలలను నిర్వహించి.. మధ్యాహ్నం నుంచి ఉపాధ్యాయులంతా సర్వేకు వెళ్లాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ నుంచి మొత్తం 6,210 మంది కుల గణన సర్వేలో పాల్గొంటుండగా అందులో సుమారు 6 వేల మంది ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే ఉండటం గమనార్హం. ఈ క్రమంలో ప్రభుత్వం చెప్పింది ఒకటి, చేస్తుంది ఒకటని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. పూర్తిగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులనే కాకుండా ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలల్లో ఉన్న ఉపాధ్యాయులను కుల గణన సర్వేలో పాల్గొనే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అరకొర వసతులతో అత్తె సరు విద్య అందుతున్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల చదువులకు కుల గణన సర్వే గండి కొడుతుందన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. విద్యా సంవత్సరం మధ్యలో నెల రోజుల పాటు ఒంటి పూట బడులు నిర్వహించడం వల్ల వారి పఠనా సామర్థ్యాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉపాధ్యాయ వర్గాల అసహనం

కుల గణన విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై ఉపాధ్యాయ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో చర్చకొచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి మిగులు ఉపాధ్యాయులను సర్వేకు తీసుకోవాలని, అలాగే ప్రాథమిక పాఠశాలల నుంచి కూడా సగం మంది ఉపాధ్యాయులను మాత్రమే సర్వేలో వినియోగించుకోవాలని సూచించామని కానీ ప్రభుత్వం కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మాత్రమే సర్వే చేయాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు. అలాగే ఉదయం పాఠశాలల్లో పాఠ్యాంశాలు బోధించి మధ్యాహ్నం సర్వే చేయడంపై ఉపాధ్యాయ వర్గాలు నిరాసక్తత కనబరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కోసం వివిధ పనుల నిమిత్తం ఉదయమే బయటికి వెళతారని, మధ్యాహ్నం ఇళ్లలో ఎవరూ ఉండరని, అలాంటప్పుడు సర్వే ఎలా చేయాలని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సెలవు రోజుల్లో సర్వే నిర్వహించేలా చర్యలు చేపట్టి వారికి అదనపు సెలవులు మంజూరు చేస్తే సరిపోతుందని కొంత మంది ఉపాధ్యాయ సంఘాల నేతలు సూచిస్తున్నారు.

జిల్లాల వారీగా సర్వేలో పాల్గొనేవారు

జిల్లా	ఉపాధ్యాయులు/సిబ్బంది
వరంగల్	1269
హనుమకొండ	844
జనగామ	960
మహబూబాబాద్	1710
జయశంకర్ భూపాలపల్లి	784
ములుగు	644

సర్వే వల్ల ఒంటిపూట నడువనున్న బడులు

జిల్లా	ప్రాథమిక పాఠశాలల సంఖ్య
వరంగల్	450
హనుమకొండ	314
జనగామ	348
మహబూబాబాద్	676
జయశంకర్ భూపాలపల్లి	365
ములుగు	372

సర్వేలో ఏం చెప్పాలి ?

నేటినుంచి కుటుంబ వివరాల సమగ్ర సేకరణ

ప్రశ్నలు, సమాధానాలపై ప్రజల్లో అనుమానాలు

ఏ వివరాలు ఇవ్వాలన్నదానిపై చర్చ

వర్ధన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల, తెగలు, వెనుబడిన తరగతులు, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టింది. గత ప్రభుత్వం 2014 ఆగస్టు 19న ఒక్క రోజులో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా తమతమ ప్రాంతాలకు చేరుకోగా పండుగ వాతావరణం కనిపించింది. ఇక తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే బుధవారం బుధవారం నుంచి 10రోజులపాటు కొనసాగనుండగా.. తొలి మూడు రోజులు స్టిక్కరింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, 10మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. అయితే ఈ సర్వేలో కుటుంబ సభ్యులందరూ ఉండాల్సి అవసరం లేదు. కుటుంబానికి సంబంధించిన ఎవరో ఒకరు చెబితే చాలు ఎన్యుమరేటర్లు నమోదు చేసుకుంటారు. సర్వే చేసే ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినపుడు ఏమి అడుగుతారో ? ఏమి సమాధానం చెప్పాలి ? ఏయే పత్రాలు దగ్గర పెట్టుకోవాలని ? అందరిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆస్తులు, అప్పులు చెప్పాలి

గత ఐదేళ్లలో తీసుకున్న రుణాలు, ఎందుకు తీసుకున్నారు. ఎక్కడ నుంచి పొందారు. ఏదైనా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొంటే ఆ వివరాలు తీసుకుంటారు. పశు సంపద సంఖ్య సేకరిస్తారు. స్థిరాస్థి, చరాస్థితోపాటు నివాస గృహం చదరపు గజాల్లో నివాస గదుల సంఖ్య, తాగునీటి వనరు విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్డి, వంటకోసం వినియోగించే ఇంధనం లాంటి వివరాలు సేకరిస్తారు.

పాస్‌బుక్ నెంబర్, భూమి వివరాలు చెప్పాల్సిందే..

భూమి వివరాల కోసం ధరణి పట్టాదార్ పాసు పుస్తకం, నెంబర్ భూముల రకం, ఎకరాల సమా చారం చెప్పాల్సి ఉంటుంది. నీటిపారుదల వనరు, కౌలు భూమి సాగుచేస్తే సాగు విస్తీర్ణ వివరాలు నమోదు చేస్తారు.

రాజకీయ నేపథ్యం ఉంటే..

ప్రజా ప్రతినిధిగా సభ్యత్వం కింద ప్రస్తుతం పూర్వం ఏ పదవిలో ఉన్నారు. పదవీకాలం? నామినేటెడ్ వివరాలు నమోదు చేస్తారు. ఈ ప్రశ్నావళి ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారికి వర్తిస్తుంది.

రిజర్వేషన్ ఫలాలు పొందితే..

విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ విధానంతో ప్రయోజనం పొందిన, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన పథకాల వివరాలను సర్వేలో నమోదుచేస్తారు. ఎస్సీ ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్ ధృవపత్రాలు పొందిరా ? డీ నోటిఫై చేయబడిన పాక్షి సంచార తెగక సమాచారాన్ని అవును, కాదనే వివరాలను నమోదుచేస్తారు.

ఏమేం తెలుసుకుంటారంటే ?

సాధారణ వివరాల కింద కుటుంబ యజమాని, సభ్యుల పేరు, సంబంధం మతం, సామాజిక వర్గం, మతం, వయసు, ఆధార్‌కార్డు నెంబరు (ఇస్తే ఇవ్వవచ్చు), మొబైల్ నెంబర్, దివ్యాంగులైతే వైకల్యం, వైవాహిత స్థితి గురించి ఆరా తీస్తారు. విద్యా వివరాల కింద పాఠశాల్లో చేరిన నాటి వయసు, ఏ మాధ్యమంలో చదివారు. బడి మానేస్తే. వివరాలు చెప్పాల్సిందే. ఉద్యోగ, ఉపాధి వివరాలకు సంబంధించి ప్రస్తుతం చేసే వృత్తి, ఉద్యోగ సమాచారం, వార్షిక ఆదాయం, ఒక వేళ వ్యాపారులైతే వార్షిక ఆదాయం చెప్పాలి. ప్రధాన కుల వృత్తులైతే. ప్రస్తుతం కొనసాగుతున్నారా? వృత్తి పరంగా వ్యాధి (ఉంటేనే), ఆదాయం పన్ను చెల్లింపుదారుల వివరాలు, బ్యాంకు ఖాతా ఉంది / లేదు. వంటి వివరాలను చెప్పాల్సిందే.



ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎన్యుమరేటర్

వలసలకు కారణం..

కుటుంబీకుల్లో ఎవరైనా ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలస వెళితే ఆ వివరాలను కూడా నమోదు చేస్తారు. వలస వెళ్లడానికి కారణం కూడా ఆరాతీస్తారు.

ఫొటో తీయరు.. పత్రాలు తీసుకోరు ?

సర్వే సందర్భంగా కుటుంబీకుల ఫొటోలు తీయరు. ఎలాంటి పత్రాలు తీసుకోరు. అందరూ ఉండాల్సిన అవసరంలేదు. కుటుంబ యజమాని ఉండి వివరాలను చెబితే సరిపోతుంది. ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు.

56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలు..

సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. ఇందు కోసం 56 పదాల ప్రశ్నలు, మరో 19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. పార్టు 1, 2, కింద 8 పేజీల్లో సమాచారం పూరిస్తారు. ఇందులో పార్టు -1లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తి వివరాల కింద సాధారణ, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ ప్రయోజ నాలు, రాజకీయ, వలసల సమాచారం అడుగుతారు. పార్టు -బీ కింది కుటుంబ వివరాలను సేకరిస్తారు. ఇందులో 17 ప్రశ్నల్లో 7 ప్రధాన, మిగిలిన అనుబంధ ప్రశ్నలు ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు


మంగపేట లక్ష్మీనర్సాపురంలో మహిళల పూజలు


వెంకటాపూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు


మల్హర్ : నాగులమ్మ వద్ద భక్తుల రద్దీ


కాళేశ్వరాలయంలో పుట్ట వద్ద భక్తుల పూజలు

మహదేవపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : అందరి దైవం నీవయ్యా .. పూజలు గైకొనుమా .. అంటూ భక్తి ప్రపత్తులతో నాగేంద్రుడిని మహిళలు కొలిచారు. పవిత్ర కార్తీక మాసవేళ మంగళవారం భక్తి శ్రద్ధలతో నాగుల చవితి పర్వాన్ని భూపాలపల్లి, ములుగు జిల్లాల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. తన సంతాన సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ మహిళలు, ముఖ్యంగా పెళ్లికాని యువతులు మంచి భవిష్యత్‌ను కోరుతూ నాగదోష నివారణార్థం నాగేంద్రుడిని కొలుస్తూ మొక్కుబడులు చెల్లించారు. మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర అనుబంధ దేవాలయంలోని నాగమయ్య పుట్ట వద్దకు ఉదయం నుంచే భక్తులు స్నానాలు ఆచరించి నాగుల చవితిని పురస్కరించుకుని నాగుల పుట్టకు పాలు పోశారు. పలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోనే కాకుండా అన్ని గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల, కొయ్యూర్ నాగులమ్మతో పాటు అన్ని గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం ఉదయమే మహిళలు పుట్ట వద్దకు చేరి పాలు పోశారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

● కాటారం : మండలంలో నాగుల చవితి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో, కాటారం శివారులోని అటవీ ప్రాంతంలో, రేగులగూడెం, దేవరాంపల్లి, గంగారం, ధన్వాడ తదితర గ్రామాల్లో పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. మండలం నుంచి పలువురు మహిళలు మల్హర్ మండలంలోని నాగులమ్మ దేవాలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు పోశారు.

● ఏటూరునాగారం : మండల కేంద్రంలోని నాగు లమ్మ ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది. పుట్ట వద్ద పాలుపోసి కోడిగుడ్లు, వివిధ రకాల పిండి వంటలు, పండ్లు నైవేద్యంగా సమర్పించారు. రామగన్న గూడెం, రాంనగర్, రొయ్యూరు, శంకరాజుపల్లి గ్రామాల్లో మహిళలు నాగులమ్మ పుట్ట వద్ద పూజలు చేసి పాలు పోశారు.

● వాజేడు : మండలంలోని గోదావరి ఒడ్డున ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, చిన్నారులు, యువతీ,యువకులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాముల పుట్టల వద్ద పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

● వెంకటాపూర్ : నాగుల చవితి పండుగను మండలకేంద్రంలో మహిళలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సహా సమస్త ప్రాణకోటిని దైవస్వరూపంగా భావించి పూజించారు. అందులో భాగంగానే నాగుపామును నాగరాజుగా, నాగదేవతగా పూజించారు.

● మంగపేట : మండలంలోని వాగోడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామమైన లక్ష్మీనర్సాపురంలో ఉన్న శ్రీ నాగులమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో గల నాగులమ్మపుట్ట, శివాలయం, కంకవనంలో పుట్టలకు పూజలు చేసి పిండివంటలతో తయారు చేసిన ప్రసాదాలు, పండ్లను, పెట్టారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. తదనంతరం నాగులమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ మేనేజింగ్ ట్రస్ట్ ప్రధానపూజారీ బాడిశ రామకృష్ణ స్వామీజీ, ప్రధానపూజారీ బాడిశ నాగరమేష్‌లతో పాటు పూజారులు, వడ్డెలు దైవ దర్శనాలు గావించి, తీర్థ, ప్రసాదాలను అందజేసి నాగుల చవితి విశిష్టతను, నాగులమ్మ దేవాలయ చరిత్రను వివరించి పసుప(బండారీ), కుంకుమలను అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన సుమారు 7 వేల మంది వరకు భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మంగపేట, కోమటిపల్లి గ్రామాల మధ్యలో గల ముక్కుడు పోశమ్మ, నాగులమ్మ దేవాలయంలో భక్తులు పుట్టలకు పూజలు చేశారు. చెరుపల్లి, అబ్బాయి గూడెం, మామిడిగూడెంలలో గల నాగదేవత ఆలయాలల్లో భక్తులు ఉదయాన్నే ప్రత్యేక పూజలు చేశారు.

పాఠకులకు అన్ని సదుపాయాలు కల్పించాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో చదువుకోవడానికి వచ్చే విద్యార్థులు, నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రంథా లయానికి కావాల్సిన సదుపాయాలు, పుస్తకాలు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో జిల్లా గ్రంథాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఎప్పుడు?

వెంకటాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రూ.2లక్షలకుపైగా ఉన్న రైతులం దరికీ రుణమాఫీ చేయాలని, మండలంలో ధాన్యం కొనుగో లు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని, మాజీ సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు

రెండో విడత పాఠ్యపుస్తకాల పంపిణీ

కాటారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రానికి రెండో విడతగా వచ్చిన పాఠ్యపుస్తకాలను మంగళవారం ఎంఆర్‌సీ సిబ్బంది పంపిణీ చేశారు. ఎంఈవో శ్రీదేవి ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఎంఆర్‌సీ నుంచి పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లారు. జూన్ నెలలోనే మొదటి విడతగా పార్ట్-1 పాఠ్యపుస్తకాలు రాగా ప్రస్తుతం పార్ట్-2 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఆర్‌సీ సిబ్బంది తెలిపారు. ఎంఆర్‌సీకి వచ్చిన 3,954 పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. కాగా రెండో విడతలోనూ విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు రాకపోవడం మాట అటుంచితే గతంలో పంపిణీ చేసిన పార్ట్-1 పాఠ్యపుస్తకాలు సైతం పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు రాకపోవడం గమనార్హం.

ఇసుక క్వారీ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ఏటూరునాగారం రూరల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి) : ఇసుక క్వారీతో ఊరుకు ప్రమాదముందని ఇసుక క్వారీ పనులను గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. మండలంలోని కొండాయి గ్రామపంచాయతీ పరిధిలో గల మల్యాల గ్రామసమీపంలోని జంపన్న వాగులో ఇసుక క్వారీ పనులు గత కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. ఇసుక క్వారీ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొండాయి గ్రామస్తులు వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి ఇసుక క్వారీ నిర్వాహకులు రహస్యంగా పనులు చేపడుతుండడంతో కొండాయి గ్రామస్తులు సంఘటన సలానికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతే గతేడాది జంపన్నవాగు ఉధృతికి గ్రామం అల్లాకల్లోముగా మారిందని, వరదల ఉధృతికి ఇసుక తవ్వకాలే కారణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇసుక క్వారీ నిర్వహణ కారణంగా జంపన్నవాగు వరదంతా ఊరును ముంచి 8 మంది ప్రాణాలను బలిగొన్నదని, ఆ విషాదం మరువక ముందే మరల ఇసుక క్వారీకి అనుమతులివ్వడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి ఇసుక క్వారీని రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ములుగులో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ములుగు మండల అధ్య క్షుడిగా కోతి కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి చంటి, ఉపాధ్యక్షుడిగా శనిగరపు శ్రీకాంత్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా దూడపాక రాజు, అధికార ప్రతినిధిగా కలువ ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌లను ఎన్నుకున్నారు.

చేప పిల్లల పంపిణీ వాహనం మళ్లింపు

- చిన్నసైజు చేప పిల్లల్ని పంపారని అసంతృప్తి


మత్స్య కారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి అవినాష్

గణపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న చేపపిల్లల వాహనాన్ని మండలంలోని మత్స్యకారులు మంగళవారం తిరిగి పంపించారు. వివిధ గ్రామాలకు పంపిణీ చేయాల్సి ఉండగా ప్రతీ ఏటా పంపిణీ చేసే సబ్సిడీ చేప పిల్లలు గత సంవత్సరం కంటే ప్రస్తుత సంవత్సరం ఆలస్యంగా రావడమే కాకుండా చిన్న సైజు చేప పిల్లలను సదరు కాంట్రాక్టర్ పంపిం చాడని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే బొచ్చ, రవ్వ, బంగారుతీగ, మెరిగ చేప పిల్లలను అందించాల్సి ఉండగా కేవలం రవ్వలను మాత్రమే పంపించాడని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ సంఘటనా స్థలానికి చేరుకుని కాంట్రాక్టర్, మత్స్యకారులతో మాట్లాడారు. చేపపిల్లలు సరైన సైజులో ఉన్నాయని, నాలుగు రకాల చేప పిల్లల్ని సప్లై చేయక పోవడం వల్లే ముదిరాజ్ కుటుంబాలు నిరసనకు గురైనట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్లో మాట్లాడగా రెండు రోజుల్లో మిగిలిన రకాల చేప పిల్లల్ని పంపిస్తానని సదరు కాంట్రాక్టర్ తెలిపాడని అవినాష్ తెలిపారు. అయినప్పటికీ చేప పిల్లల వాహనాన్ని తిరిగి వెనక్కి పంపించారు.

ఆర్ కృష్ణయ్యను కలిసిన పలు బీసీ సంఘాల నేతలు


ఆర్.కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘాల నేతలు

కాటారం/మహదేవపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాటారం డివిజన్ లోని పలు బీసీ సంఘాల నేతలు మంగళవారం కలిసారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేయతలపెట్టిన బీసీ కుల గణనలో తలెత్తే ఇబ్బందులు, బీసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను బీసీల సంఘాల నేతలు వారికి వివరించారు. రెడ్డిగాండ్ల కులస్తులు బీసీలు కాదని అప్పటి సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని బీసీ కమీషన్ చెప్పి బీసీ కుల ధృవీకరణ పత్రాలివ్వద్దని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలిచ్చిందని గుర్తుచేశారు. కృష్ణయ్యను కలిసిన వారిలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నిడిగొండ షైనర్ బాబు, అఖిలభారత యాదవ మహాసభ డివిజన్ అధ్యక్షుడు ఆత్మకూరి స్వామి యాదవ్, అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు విజ్జగిరి సమ్మయ్య, శాలివాహన సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు సముద్రాల తిరుపతి, పద్మశాలి సంఘం నేత శ్రీనివాస్, పలు బీసీ కుల సంఘాల జిల్లా, మండల నేతలు వెన్నంపల్లి మహేష్ ఉన్నారు.

టీపీయూఎస్ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష



ప్లకార్డులు చేతబూని దీక్ష చేస్తున్న టీపీయూఎస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమం జరిగింది. పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరు కాగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ములకల్ల తిరుపతి హాజరై మాట్లాడారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద రాష్ట్ర స్థాయిలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, నాయకులు మారబోయిన మహేందర్, కర్ణాకర్, శాంత, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, రఘుపతి, రమణారెడ్డి, గిరిధర్ పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్లగొండ పద్మాకర్‌రెడ్డి, ఆకుల శేఖర్‌లు మాట్లాడారు. సంఘం నాయకులు వాంకుడోత్ జ్యోతి, గోనె రవీందర్, ఎడ్ల సంపత్, సదానందం పాల్గొన్నారు.

హరీష్‌రావు మాటలు నమ్మి మోసపోవద్దు

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, బీఆర్ఎస్ నాయకుడు తన్నీరు హరీష్‌రావు మాటలు నమ్మి సర్పంచ్‌లు మోసపోవద్దని కాంగ్రెస్‌పార్టీ ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు కోరారు. మంగళవారం ములుగులో జరిగిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతలు సర్పంచ్‌లకు కనీసం జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, బీఆర్ఎస్ పాలనలో ఎంతోమంది సర్పంచ్‌లు అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఎవరైతే నష్టపోయామని ప్రభుత్వాన్ని ప్రశ్నించేయత్నం చేస్తున్నారో వారికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. సర్పంచ్‌లు ఇప్పటికైనా హరీష్‌రావు మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ సమావేశంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, నాయకులు పల్లె జయపాల్‌రెడ్డి, వంగ రవియాదవ్, మునినపల్లి కుమార్, ఎమ్డీ.పాషా, ఎమ్డీ.చాంద్‌పాషా, కంబాల రవి, నూనేటి శ్యామ్, ఓరుగంటి అనిల్, సయ్యద్ షకీల్, ఇమ్మడి రాజు, నల్లెల భరత్‌కుమార్, మట్టెవాడ తిరుపతి, అర్షం రఘు, బోడ సతీష్, బోడ రఘు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేతకాని సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం

మంగపేట, నవంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మంగపేట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర నేతకాని సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు డికొండ నర్సింహరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర నేతకాని హక్కుల పరిరక్షణ సంఘం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కావిరి చిన్ని కృష్ణ, రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి గోగు మల్లయ్య, హాజరై తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ చేపడితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంఘం విధించిన 5 డిమాండ్స్‌ను నేరవేర్చాలని సూచించారు. పలు అంశాలపై పలువురు వక్తలు మాటాడారు. ఈ సమావేశంలో సీనియర్ జిల్లా నాయకులు మావూరి వెంకయ్య, సునారి నాగేంద్రబాబు, సమ్మయ్య, సందీప్, దుర్గం యాదగిరి, మండల ముఖ్య నాయకులు జాడి ప్రసాద్ పాల్గొన్నారు.

అల్లుగబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలి


సభ్యత్వ నమోదును ఉపాధ్యాయులకు అందజేస్తున్న జంగయ్య

మంగపేట, నవంబరు, 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో భాగంగా మంగపేట, కమలాపురం, రాజుపేట, తిమ్మంపేట జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలు, బ్రాహ్మణపల్లి, చుంచుపల్లి, కోమటిపెల్లి ఆశ్రమ పాఠశాలలతో పాటు మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టిఎస్ యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అల్లుగబెల్లి నర్సిరెడ్డి నిత్యం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేశారని తెలిపారు. మండలిలో ఉపాధ్యాయుల సమస్యలను లెవనెత్తి, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారని వివరించారు. ఉపాధ్యాయుల కోసం పరితపించే అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని సంగయ్య డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యద ర్శి గొప్ప సమ్మారావు, ములుగు జిల్లా అధ్యక్షుడు పొడెం సమ్మయ్య, జిల్లా కోశాధికారి ములుకాల వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి కొండ చెంచయ్య, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుండం పురుషోత్తం, జాటోత్ సురేష్, సంఘం నాయకులు గడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తులను సకాలంలో ఆమోదించాలి

కాటారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం టీచర్లు చేసుకున్న దరఖాస్తులను బీఎల్‌వో ఆధ్వర్యంలో విచారణ చేసి సకాలంలో ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు. మంగళవారం ఈ మేరకు తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రమందించారు. టీచర్ ఎమ్మెల్సీ కోసం దరఖాస్తులు చేసుకున్నవారిని గెజిటెడ్ సంతకాలు అడగకుండా బూత్ లెవల్ అధికారి ఆధ్వర్యంలో విచారణ చేయించి ఆమోదింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు బొల్లం సతీష్, గండు రాజబాబు, అనపర్తి తిరుపతి, నడిపెల్లి సురేష్‌రావు, హట్కర్ రమేష్‌నాయక్, దేవునాయక్, మోహన్‌రావు ఉన్నారు. కాగా తమకు అంగన్వాడీ విధులతో పాటు బీఎల్వో, ఇతర పనులను చేయించడం సరికాదని తహసీల్దార్‌కు అంగన్‌వాడీలు వినతిపత్రం ఇచ్చారు.

ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు మూల స్తంభం

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు మూలస్తంభమని ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం అన్నారు. కళాశాల ఆవరణలో ములుగు జిల్లా స్వీప్, కళాశాల స్వీప్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగం, ఓటు ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ స్వీప్ కన్వీనర్ ఎ.సతీష్ మాట్లాడుతూ కేవలం విద్యార్థులే కాకుండా వారి గ్రామ పరిధిలోని ఓటరుగా నమోదుకాని వారందరిని నమోదు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇందుకోసం ఈనెల 9,10తేదీల్లో ఓటరు ప్రత్యేక నమోదు ప్రక్రియలో భాగంగా మీ ప్రాంతంలో బూత్‌లెవల్ ఆఫీసర్ వద్ద నమోదు చేసుకోవచ్చని అన్నారు. అనంతరం కళాశాల స్వీప్ కమిటీని ఎన్నుకున్నారు. క్యాంపస్ అంబాసిడర్‌గా రష్మీ, అసోసియేట్ అంబాసిడర్స్‌గా ప్రశాంత్, రవళిలు ఎన్నికయ్యారు. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.బాలయ్య, స్వీప్ కన్వీనర్ డాక్టర్ ఉదయశ్రీ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్. భాస్కర్, టీఎస్‌కేఎస్ కన్వీనర్ కవిత, అధ్యాపకులు సోమన్న, శంకర్, తేజోలత, సరిత, నాగమణి, రాధిక, శిరీష, అనిల్‌కుమార్, విజిత, రమేష్, మౌలానా, అనిత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లేశం

జెన్‌కో సీఈకి నిర్వాసితుల వినతి

మల్హర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో భాగంగా నిర్వాసితులకు జెన్‌కో లో ఉద్యోగ అవకాశాలు కల్పించి, డేంజర్ జోన్‌లో ఉన్న తమలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరుతు భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం జెన్ కో సీఈ శ్రీప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించారు. కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి, తాండ్ర సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సన్మాన కార్యక్రమానికి తరలిరావాలి

మహదేవపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న గురువారం కాటారం బీఎల్ఎం గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర పార్టీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి రెడ్డి గాండ్ల కుల సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కుల సంఘం నిర్వహణ కమిటీ కోరింది. ఈ సందర్భంగా రెడ్డి గాండ్ల కుల సంఘం నాయకులు చల్ల తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి గాండ్ల కుల సంఘం నాయకులు చల్లా తిరుపతిరెడ్డి, సింగిల్ విండో సంఘం నాయకులు చల్లా తిరుపతిరెడ్డి, వెన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పోటు మల్లారెడ్డి, అయిత రాజిరెడ్డి, అయిత రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మహదేవపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలో ఇళ్లు లేని నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో నిర్వాసితులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరి లింగాల రామయ్య, మండల అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి మోటము వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సింగరేణి జీఎంను కలిసిన పలువురు నాయకులు

కాకతీయఖని, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాకు నూతనంగా వచ్చిన జీఎం రాజేశ్వర్‌రెడ్డిని పలువురు మర్యాద పూర్వకంగా కలిసారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ, టీఎస్‌యూఎస్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ఓసీ-2 ప్రభావిత ప్రాంతాలైన ఆకుదారివాడ, ఫక్కీర్‌గడ్డ , భూనిర్వాసితులు జీఎంను వేరువేరుగా కలిసి శాలువా, బొకేతో సన్మానించారు. బుర్ర మనోజ్‌గౌడ్, రాజయ్య, రమేష్, తిరుపతి, గట్టయ్య, జనార్దన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏటీసీ నిర్మాణ పనుల ఏర్పాట్లు ప్రారంభం

కాటారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని కాటారం రెవెన్యూ గ్రామ శివారు సర్వే నెంబర్ 49లో గల తిమ్మన్నకుంటలో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) కోసం కేటాయించిన ఎకరం స్థలంలో నిర్మాణ పనుల కోసం మంగళవారం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నిర్మాణ సంస్థ సైట్ ఇంజనీర్లు, సిబ్బంది, ఐటీఐ ప్రిన్సిపాల్, శిక్షకులు సర్వే పనులు చేయించారు. డీజీపీఎస్‌తో సర్వే చేయించి పిల్లర్లు పోయడానికి జేసీబీతో గుంతలు తీశారు. పలువురు మహిళలు, గ్రామస్తులు పనులను అడ్డుకోవడానికి రాగా ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో సివిల్, టీజీఎస్పీ పోలీసులు, మహిళా కానిస్టేబుళ్ల వారిని పక్కకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అనంతరం వదిలేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కాటారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ల్యాబ్‌లో ఈ నెల 3న ఎల్ఈడీ టీవీ చోరీ కేసును పోలీసులు 24గంటల్లోనే ఛేదించారు. ఎస్సై అభినవ్ నేతృత్వంలో పోలీసులు చోరీ కేసు నిందితుడిని పట్టుకుని టీవీని రికవరీ చేశారు. గురుకులంలో టీవీ చోరీ కేసులో కాటారం గ్రామానికి చెందిన గంట పరిపూర్ణంను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. కాగా నిందితుడిపై గతంలో పలు దొంగతనాల కేసులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సంపత్, లవన్, నాగరాజు, రఘు, నరేష్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కన్నాయిగూడెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన వారికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగ పడుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ అఫ్సర్ పాషా అన్నారు. మంగళవారం ఆయన సీఎం సహాయ నిధి చెక్కులను రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. మండలంలోని బుట్టాయిగూడెంకు చెందిన సునార్కాని శంకరయ్యకు రూ.60 వేలు, ముప్పనపల్లి కి చెందిన తిప్పనపల్లి సమ్మయ్య కు 60 వేలు, లక్ష్మీపురానికి చెందిన బోట సర్వేష్‌లకు రూ.12వేల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జి జాడి రాంబాబు, అబ్బు రమేష్, చీదారి సువన్, తాటి రాజబాబు, సాంబశివ, కటకం మల్లయ్య పాల్గొన్నారు.

ఇసుక డంపును పరిశీలించిన తహసీల్దార్

మేడారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం ఊరట్టం స్థూపం వద్ద నిల్వచేసిన అక్రమ ఇసుక డంపులను తహసీల్దార్ గిరిబాబు రెవెన్యూ సిబ్బందితో కలసి మంగళవారం పరిశీలించారు. జంపన్నవాగులోని రెడ్డిగూడెం లోలెవెల్ వంతెన పరిసరాల నుంచి తీసిన ఇసుక గుంతలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇటీవల మంజురు అయిన రహదారుల కోసం కాంట్రాక్టరు అనుమతి లేకుండా ఇసుక తరలించడం జరిగిందన్నారు. పూర్తి వివరాలు జిల్లా కలెక్టర్ దివాకరకు తెలియజేయడం జరిగిందన్నారు. ఇసుక తీసిన గుంతలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ రెవన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జాకారంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు)లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం రక్తహీనత పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌టీ బృందం సభ్యులు 5,6,7వ తరగతి విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, అధ్యాపకులు సురేష్‌బాబు, వైద్యాధికారులు సీహెచ్.రాములు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించాలి

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 5: మొరంచపల్లి పథకం పనులను వెంటనే ప్రారంభించాలని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చాడ రఘునాథ్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం మంజూర్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మొరంచపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మరమ్మత్తులకు రూ. 34.20 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయకట్టు రైతులు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటారన్నారు. అధికారులు వెంటనే టెండర్లు పిలచి యాసంగికి సాగునీరు అందించాలని కోరారు.

బాలలతో పని చేయించుకుంటే చర్యలు తప్పవు

ములుగు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలలతో పని చేయించుకుంటే చర్యలు తప్పవని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా రెస్క్యూ అండ్ రెహబిలిటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ములుగు పట్టణంలోని రైస్‌మిల్లు యజమానులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మహేందర్ బాలకార్మిక చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

కాటారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం శివారులో కాటారం-మంథని రహదారిపై ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ప్రమాదంలో కాటారం గ్రామానికి చెందిన కొండగొర్ల సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, క్షతగాత్రుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య పత్తి చేనుకు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి వెళ్తున్నాడు. పెట్రోల్ పంప్ సమీపానికి రాగానే పెట్రోల్ పోయించుకోవడానికి పంప్ వైపు వాహనాన్ని తిప్పి వెళ్తున్నాడు. ఇంతలో గోదావరిఖని డిపోకు చెందిన బస్సు వెనకాల నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి కొంత దూరం లాక్కెళ్లింది. వాహనం బస్సు కింద ఇరుక్కుపోగా సమ్మయ్య రెండు టైర్ల మధ్య పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.